నీటి కష్టాలు తీరేదెప్పుడో?

- కొత్త రిజర్వాయర్‌పై 52 బస్తీల ఆశలు
- పనులు పూర్తయినా పరిష్కారం కాని సమస్య
- పైప్‌లైన్ నిర్మాణంలో జాప్యమే కారణం



ఎస్పీఆర్‌హిల్స్‌లో కొత్తగా నిర్మించిన 3 మిలియన్ లీటర్స్ రిజర్వాయర్

యూసుఫ్‌గూడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మూడు నాలుగు రోజులకోసారి వచ్చే నల్లా నీటి కోసం పనులు మానుకుని ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంటుంది. సమస్య పరిష్కారం కోసం బస్తీల వాసులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో రహ్మత్‌నగర్, బోరబండ పరిసర ప్రాంతాల్లోని 52 బస్తీల ప్రజల కోసం ఎస్పీఆర్‌హిల్స్‌లో కొత్త రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. వాస్తవానికి ఈ రిజర్వాయర్ గత ఏడాది వేసవి కాలానికి పనులు పూర్తి చేసుకుని అందుబాటులోకి రావాల్సి ఉంది. అయితే ఇప్పటికీ ఆ పరిస్థితి లేదు. ఇటీవల ట్రయల్ రన్ నిర్వహించడంతో స్థానికుల్లో కొంత ఆశ కలిగి త్వరలోనే నీటి కష్టాలు తీరతాయని భావించారు. అయితే ఎప్పుడు అందుబాటులోకి వస్తుందా అనే సందిగ్ధత మాత్రం వారిని వీడటం లేదు.

ప్రస్తుతం నీటి సరఫరా ఇలా..

శేరిలింగంపల్లి నుంచి గోదావరి నీరు ఎస్ఆర్‌ఆర్‌పురం కాలనీ సైట్-2లోని ఎస్పీఆర్ హిల్స్ సెక్షన్ కార్యాలయంలోని 6 ఎంఎల్(మిలియన్ లీటర్స్) రిజర్వాయర్‌కు చేరుతుంది. అక్కడ నుంచి ఎస్పీఆర్ హిల్స్‌లో గతంలో ఏర్పాటు చేసిన 1 మిలియన్ లీటర్స్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేసి 52 బస్తీలకు పంపిణీ చేస్తున్నారు. గతంలో ఎప్పుడో ఏర్పాటు చేసిన ఈ రిజర్వాయర్ సామర్థ్యం పెరిగిన జనాభాకు సరిపోవడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొత్త రిజర్వాయర్‌తో సమస్యకు పరిష్కారం

సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం ఎస్పీఆర్ హిల్స్‌లోని 1 మిలియన్ లీటర్స్ రిజర్వాయర్ పక్కనే మరో 3 మిలియన్ లీటర్స్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టింది. ఇది అందుబాటులోకి వస్తే మొత్తం 4 మిలియన్ లీటర్స్ సామర్థ్యం గల రిజర్వాయర్‌తో నీటి ఇబ్బందులు పూర్తి తొలగిపోయే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. అయితే ఇప్పటికే రిజర్వాయర్ పనులు పూర్తి కాగా, సెక్షన్ కార్యాలయంలో పంపింగ్ కోసం రెండు 270 హెచ్‌పీ మోటార్లను సైతం అధికారులు సిద్ధంగా ఉంచారు. ఈ నెల 14న ట్రయల్ రన్ నిర్వహించినప్పటికీ అవసరమైన పైప్‌లైన్ నిర్మాణం లేకపోవడంతో ఇది వినియోగంలోకి రాలేదు.

సమస్యను త్వరగా పరిష్కరించాలి

ఇటీవల కొత్త రిజర్వాయర్‌కు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సమక్షంలో ట్రయల్ రన్ నిర్వహించారు. పనులు పూర్తి కాలేదంటూ కొందరు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరం. అయితే ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించే ప్రయత్నం చేయాలి.

- వేముల యాదయ్య, బస్తీల ఐక్యత సంఘం అధ్యక్షుడు

వేసవికి నీరు అందిస్తాం



ఎస్పీఆర్ హిల్స్‌లో కొత్త రిజర్వాయర్ పనులు పూర్తయ్యాయి. పైప్‌లైన్ పనుల కోసం రోడ్ కటింగ్ అనుమతుల గురించి జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందించి చర్చించాం. త్వరలోనే పైప్‌లైన్ పనులు ప్రారంభమవుతాయి. వేసవి నాటికి పనులు పూర్తి చేసి కొత్త రిజర్వాయర్ ద్వారా ప్రజలకు నీరు అందిస్తాం.

- సీఎన్ రెడ్డి, రహ్మత్‌నగర్ కార్పొరేటర్


కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య తదితరులు

దివ్యాంగుల అసెస్మెంట్ క్యాంపులో 130 దరఖాస్తులు

ఖైరతాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ నియోజకవర్గంలోని దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ కోసం ఖైరతాబాద్ సరస్వతీ విద్యామందిర్ పాఠశాలలో అసెస్మెంట్ క్యాంపు నిర్వహించారు. ఇందులో దాదాపు 130 మంది దివ్యాంగులు, వృద్ధులు తమకు కావాల్సిన పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్య హాజరై దివ్యాంగులతో ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. సెంట్రల్ బీజేపీ అధ్యక్షుడు గౌతంరావు, నాయకులు కె.శ్రీధర్, రఘురాంరెడ్డి, వీణామాధురి, రామ్మోహన్‌రావు, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెరీడియన్ స్కూల్, తాతారావు ఇళ్లు, ఈ-సేవ, సెలబ్రేషన్ హోటల్, వెంకటగిరి ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పంజాగుట్ట మోడల్ హౌస్, కేబీఆర్ స్టేడియం ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మున్సిపల్ పార్క్, బీఎస్ మక్త ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, సోమాజిగూడ శాంతిశిఖర ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

సైఫాబాద్ ఏడీఈ పరిధిలో..

మరమ్మతుల కారణంగా సైఫాబాద్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అనుగ్రహ ఫీడర్ పరిధిలోని అనుగ్రహ అపార్టుమెంట్, నవీన్ నగర్, శారద అపార్టుమెంట్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఖైరతాబాద్ సెవెన్ టెంపుల్స్ ఫీడర్ పరిధిలోని ఖైరతాబాద్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్, చింతల్ బస్తీ, తుమ్మల బస్తీ, హిందీ ప్రచార సభ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.


సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

టీడీపీకి పూర్వ వైభవం వస్తుంది

బంజారాహిల్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆ పార్టీ నాయకులు అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్‌లో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదు మొదలైంది. ఈ సందర్భంగా నియోజకవర్గ నాయకుడు నర్సింహులు మాట్లాడుతూ.. టీడీపీని కేవలం నాయకులు మాత్రమే వీడారని, కార్యకర్తల బలం అలాగే ఉందన్నారు. సభ్యత్వ నమోదుకు మంచి స్పందన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో సలీం, యాదగిరి, పి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


మధురానగర్ ఏ-బ్లాక్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు

నాలాలో పూడిక తీసి వ్యర్థాలను వదిలేశారు

వెంగళరావునగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీ మధ్యలో నుంచి ప్రవహిస్తున్న మురుగునీటి నాలాలో వారం క్రితం వ్యర్థాలను తీసి అలానే వదిలేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు స్థానికులు తమ ఇళ్లలోని వ్యర్థాలను, కొబ్బరి బొండం వ్యాపారులు తాగేసిన బొండాలను పడేయడంతో గుట్టగా తయారయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


ట్రోఫీ బహూకరిస్తున్న కిరణ్

వాలీబాల్ విజేత చెన్నై

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): చెరుకూరి విఠల్ స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌లో చెన్నై జట్టు విజేతగా నిలిచింది. నగరంలో రెండ్రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్లో చెన్నై జట్టు 25-22, 25-23తో ముంబైపై గెలిచి, ట్రోఫీ సొంతం చేసుకుంది. జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు, టీజీఎస్ఆర్టీసీ డీవీఎం జి.కిరణ్ రెడ్డి విజేత జట్టుకు ట్రోఫీ ప్రదానం చేశారు.

2 నుంచి మైనార్టీ అభ్యర్థులకు గ్రూప్-2 మాక్ టెస్టులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్ష రాసే మైనార్టీ అభ్యర్థులకు డిసెంబరు 2, 3, 9, 10 తేదీల్లో రెండు ఫ్రీఫుల్ లెంగ్త్ మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఆయా తేదీల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలుంటాయని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మహ్మద్ ఇలియాస్ తెలిపారు. వివరాలకు గన్‌ఫౌండ్రీలోని జామియా నిజామియా కాంప్లెక్స్‌లో లేదా 040-23236112 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ధర్మ పరిరక్షణలో బ్రాహ్మణుల పాత్ర గొప్పది

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణలో బ్రాహ్మణుల పాత్ర ఎంతో గొప్పదని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం సనత్‌నగర్‌లోని హనుమాన్ ఆలయ ఆవరణలో బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో హిందూ మతానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, త్రిదండి దేవనాద రామానుజాచార్యులు, సమాఖ్య సభ్యులు ఎంవీ శాస్త్రీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న కె.ఈశ్వర్‌రావు, నర్సింహ తదితరులు

'పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం'

పంజాగుట్ట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను బానిసలుగా చూస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు, రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఉద్యోగ జేఏసీ నేతలు ఆరోపించారు. ప్రభుత్వ శాఖలు, సంస్థలలో ఏజెన్సీలను రద్దుచేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నేరుగా వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం మిలియన్ మార్చ్ తరహాలో ఉద్యమం చేస్తామని వారు హెచ్చరించారు. జేఏసీ అధ్యక్షుడు పి.లక్ష్మయ్య అధ్యక్షతన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు మాట్లాడుతూ.. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. వచ్చే నెల 9 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ.. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పర్మినెంట్ ఉద్యోగుల కంటే ఎక్కువ పనిచేస్తున్నా వివక్షకు గురవుతున్నారన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జి.చెన్నయ్య తదితరులు

'మాలల సింహగర్జన' పోస్టర్ ఆవిష్కరణ

పంజాగుట్ట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపే పార్టీలను బొంద పెడతామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ జి.చెన్నయ్య హెచ్చరించారు. ఆదివారం పంజాగుట్ట బాలాపుర బస్తీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిసెంబరు 1న పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న మాలల సింహగర్జన సభ పోస్టర్‌ను సమితి కన్వీనర్ డి.సర్వయ్య, గ్రేటర్ చైర్మన్ రాజు ఉస్తాద్, గ్రేటర్ కో చైర్మన్ రావుల విజయ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పంచాయతి కమిటీ అధ్యక్షుడు బి.నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి మాణిక్ రావ్, స్థానిక నాయకులు ఎస్.రామ్మూర్తి, బిట్ల శ్రీనివాసరాజు, సుధాకర్, ఎం.రవి కుమార్ పాల్గొన్నారు.

సింహగర్జనను విజయవంతం చేద్దాం

ఖైరతాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెనుకబాటుకు సంబంధించిన గణాంకాలు లేకుండా ఎస్సీ వర్గీకరణ కోరడం అసంబద్ధం, రాజ్యాంగ వ్యతిరేకమని మాల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ నిమ్మ బాబూరావు అన్నారు. ఆదివారం మింట్ కాంపౌండ్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద డిసెంబరు 1న జరగనున్న మాలల సింహ గర్జన పోస్టర్‌ను ఆయన ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాలలు నేటికీ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, ఈ విషయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించకపోతే మాలల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

పెరుగుతున్న తుంటి మార్పిడి సర్జరీలు

- సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డా.ఉదయ్ కృష్ణ మైనేని


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హిప్ జాయింట్ సమస్యలతో రివిజన్ హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు పెరుగుతున్నాయని సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, ప్రోగ్రామ్ కోర్సు డైరెక్టర్ డా.ఉదయ్ కృష్ణ మైనేని అన్నారు. తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్, ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీ ఆధ్వర్యంలో యశోద ఆస్పత్రి సహకారంతో మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం సీఎంఈ ఆన్ రివిజన్ హిప్ రీప్లేస్‌మెంట్ సదస్సు నిర్వహించారు. తుంటి మార్పిడి శస్త్రచికిత్సల్లో పెరుగుతున్న ప్రాబల్యం, కోవిడ్-19 తర్వాత అధిక స్టెరాయిడ్ వాడకం, గాయాల కారణంగా ప్రభావితమైన రోగుల్లో సంభవించే సమస్యలు, వృద్ధ రోగుల్లో ఏర్పడుతున్న సవాళ్లను పరిష్కరించే విధానాలపై చర్చించారు. యశోద ఆస్పత్రి డైరెక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. ఆర్థోపెడిక్ కేర్‌ను అభివృద్ధి చేయడంపై ఆస్పత్రి ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.

వైద్యులు పునర్జన్మనిస్తారు

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డు ఆవిష్కరణ



హెల్త్ కార్డును ఆవిష్కరిస్తున్న బండి సంజయ్

మోతీనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవుడు జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా తన జీవితంలో 12 సంవత్సరాల క్రితం జరిగిన ఓ సంఘటన గురించి వివరించారు. ఆదివారం నగరంలోని సైబర్ గేట్ సమీపంలో మెడికవర్ ఆస్పత్రిలో నూతనంగా తీసుకొచ్చిన మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డ్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2012లో కరీంనగర్‌లో ఓ ర్యాలీ చేస్తుండగా తనకు హార్ట్‌స్ట్రోక్ వచ్చిందని.. ఆ సమయంలో తన సోదరి డాక్టర్ సౌజన్య డాక్టర్ శరత్‌కు ఫోన్ చేసి చెప్పగా ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డాక్టర్ సాహుతో మాట్లాడి తనను బతికించారన్నారు. ఈ విధంగా డాక్టర్ శరత్, డాక్టర్ సాహు తనకు పునర్జన్మ ఇచ్చారన్నారు. మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డుతో రోగులకు 15 నుంచి 50 శాతం వరకు రాయితీ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సీఎండీ డాక్టర్ అనిల్ కృష్ణ, డైరెక్టర్ డాక్టర్ శరత్ రెడ్డి, డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యూనియన్ సభ్యులు

ముగిసిన మెగా వైద్య శిబిరం

బంజారాహిల్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మూవీ, టీవీ, డిజిటల్ ఆర్టిస్టుల యూనియన్ (టీఎంటీడీఏయూ), చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్, మాగ్నాడ్ ఆస్పత్రి సంయుక్తంగా జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి చారిటబుల్ ట్రస్టులో మూడు రోజుల పాటు నిర్వహించిన మెగా వైద్య శిబిరం ఆదివారం ముగిసింది. కార్యక్రమంలో భాగంగా సుమారు 624 మంది వైద్యసేవలు పొందారు. ముగింపు కార్యక్రమానికి తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తరఫున కళాకారులకు ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామన్నారు. యూనియన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి బి.నూకరాజు, ఉపాధ్యక్షుడు డి.పద్మ రేఖ, శ్రీనివాస్ రాథోడ్ పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌లో ఉచిత వైద్యశిబిరం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్

హైదరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభించారు. కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్‌సైన్సెస్ (కేఎన్ఆర్‌యూహెచ్ఎస్), నేషనల్ సర్వీస్‌స్కీమ్ (ఎన్ఎస్ఎస్) సహకారంతో ఆదివారం రాజ్‌భవన్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌ను ఉద్యోగులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు వినియోగించుకున్నారు. అల్లోపతి, ఆయుర్వేదం, డెంటల్ వైద్యులు, పారామెడికల్ బృందాల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం, జాయింట్ సెక్రటరీ జె.భవానీ శంకర్ తదిరులు పాల్గొన్నారు.

డిజిటల్ మీడియా ప్రీమియర్ లీగ్ జెర్సీ ఆవిష్కరణ

- హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీశ్‌రావు


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం, మాజీ మంత్రి హరీశ్‌రావు

యూసుఫ్‌గూడ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ పోలీస్‌లైన్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన డిజిటల్ మీడియా ప్రీమియర్ లీగ్ జెర్సీ ఆవిష్కరణలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలని, క్రీడల ద్వారా యువత ఆరోగ్యంగా ఉంటారన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం స్పోర్ట్స్ యూనివర్శిటీని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. నేటి తరానికి క్రీడలు, వ్యాయామం ఎంతో ముఖ్యమని, వాటికోసం రోజులో కనీసం కొంత సమయం కేటాయించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు బ్యాట్, బాల్ పట్టుకుని సందడి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, పైడి రాకేష్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, లీగ్ నిర్వాహకుడు వినయ్ తదితరులు పాల్గొన్నారు.


వనభోజనాలకు హాజరైన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వనభోజనాలతో ఆప్యాయతలు పెరుగుతాయి

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వనభోజనాలతో మనుషుల మధ్య ఆప్యాయతలు పెరుగుతాయని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. కార్తీకమాసం సందర్భంగా ఎల్లారెడ్డిగూడ ఇంజనీర్స్‌కాలనీ వాసులు ఏర్పాటు చేసిన వనభోజనాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ, బస్తీలు సంక్షేమ సమితులుగా ఏర్పడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అభివృద్ధి విషయంలో తాను వెనకడుగు వేయకుండా పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, వెంకట్ శ్రీనివాసరావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దుకు పోరాటం

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్


సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్, పక్కన ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తదితరులు

రాంనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాలకు ప్రయోజనం చేకూర్చేందుకు తీసుకున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు కోసం న్యాయపోరాటం చేస్తూనే మరోవైపు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో ఈడబ్ల్యూఎస్ అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం 2019లో 103వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉద్యోగ అవకాశాలు లభించడం లేదన్నారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీలు కలిసి రాజ్యాధికారం సాధిస్తేనే అగ్రవర్ణాలు చేసే కుట్రలు, కుతంత్రాలు తగ్గుతాయన్నారు. బీసీలు రాజ్యాధికారంలోకి రావడానికి తాను కృషి చేస్తానన్నారు. బీసీల కోసం రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ఐక్యత లేకపోవడం వల్లనే 4 శాతం ఉన్న అగ్రవర్ణాలు రాజ్యమేలుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ బాగయ్య, బీసీ రాజ్యాధికార సమితి మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తుల కవిత, ఉపాధ్యక్షురాలు హైమావతి, కార్యదర్శి మంజుల, నాయకులు డి.కొమురయ్య, కుమారస్వామి యాదవ్, యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ మడత కిషోర్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం


మాట్లాడుతున్న డివిజన్ కాంగ్రెస్ నాయకులు

పద్మారావునగర్, నవంబరు, 24, (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమ ప్రత్యేక చొరవ కారణంగా గొల్లకొమురయ్య కాలనీ ప్రధానదారిలోని మురికినీటి సమస్యకు పరిష్కారం లభించిందని స్థానిక కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి గొల్లకొమురయ్య కాలనీ ప్రధానదారిలో దీర్ఘకాలంగా ఉన్న మురికినీటి సమస్యను స్థానిక ప్రజలు కోట నీలిమ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె సమస్యను పరిశీలించి, వెంటనే సంబంధిత జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అధికారులు సమస్యను శాశ్వతంగా పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో జీఎల్ రమేశ్ బాబు, పాండుగౌడ్, మల్లం రమేశ్, శ్రీనివాస్, కలీం, జగదీశ్, నారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా మహా అన్నకూట మహోత్సవం


మహాఅన్నకూట మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర్ భారతి స్వామి

బోయిన్‌పల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బోయినపల్లి తాడ్‌బండ్ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం మహాఅన్నకూట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసంలో ప్రతి సంవత్సరం ఈ మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కార్యక్రమానికి శంకరాచార్య మహాసంస్థానం జగద్గురు పుష్పగిరి పీఠాధీశులైన మదభినవోద్దండ విద్యాశంకర భారతిస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆలయ కమిటీ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.


ప్రధాన పురోహితులతో ధర్మపుర పీఠాధిపతి పరమాచర్య స్వామి

స్కందగిరిలో ధర్మపురం పీఠాధిపతి పూజలు

పద్మారావునగర్, నవంబరు, 24 (ఆంధ్రజ్యోతి): సికిందరాబాద్, పద్మారావునగర్ స్కందగిరి శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయానికి తమిళనాడులోని ధర్మపురం ఆధీనంలోని 27వ శ్రీమసిలమణి దేసిగ జ్ఞానసంబంధ పరమాచార్య స్వామి వచ్చారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకొని, ఆశీర్వాదం పొందారు. పీఠాధిపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి రెండు రోజులపాటు భక్తుల దర్శనార్థం ఆలయంలోనే ఉంటారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ కృష్ణన్ రాజమణి, కృష్ణప్రసాద్, వేదపాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న మాదిగ హక్కుల పోరాట సంఘం నాయకులు

మాదిగ హక్కుల పోరాట సంఘ సమావేశం


పద్మారావునగర్, నవంబరు 24, (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ఆదివారం సనత్‌నగర్ మాదిగల హక్కుల పోరాట సంఘం కన్వీనర్ కురుమ బలరామ్ ఆధ్వర్యంలో ఓ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సలహాదారు కుర్మ లక్ష్మీపతి మాట్లాడుతూ... అన్ని రంగాలలో మాదిగలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఇకపై మాదిగలు అప్రమత్తంగా మెలగి, తమ హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేయాలని అన్నారు. కో కన్వీనర్ ఏసూరి శ్రీనివాస్‌రావు, దేశపాక గోవర్ధన్, బండారి శివ, లక్ష్మీనారాయణ, మహేశ్, శంకర్, రాజు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు

మాలల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి

అడ్డగుట్ట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో డిసెంబరు 1న జరిగే మాలల ఆత్మీ సమ్మేళనం సభకు మాలలు పెద్ద ఎత్తున తరలిరావాలని డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం చైర్మన్ కేఎన్ సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం తుకారాంగేట్ గడ్డమీదిబస్తీలోని కమ్యూనిటీహాల్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొని సింహగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 1న సికింద్రాబాద్‌లో జరిగే సభకు తుకారాంగేట్ నుంచి ఐదు వందల మందితో ర్యాలీగా వెళతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తుకారాంగేట్ నుంచి అడ్డగుట్ట ఈస్ట్ మారేడుపల్లి మీదుగా పరేడ్ మైదానానికి వెళతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత మహీందర్, చిగురు వెంకటేష్, అశోక్, కేఎస్.ప్రసాద్, సానాది శ్రీనివాస్, జయకుమార్, ఉమాశంకర్, విద్యాసాగర్, రమాదేవి, వసంత, పుష్ప పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని 55 ఏళ్ల వ్యక్తి శనివారం నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడికి ఎడుమచేతికి ఆరువేళ్లు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే 9666280808 నెంబరుకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పార్కులు, ఓపెన్ జిమ్‌లకు పెరుగుతున్న ఆదరణ


పార్కులో చెట్లు


చిన్నారులతో సందడిగా ఉన్న వెంకటాపురం పార్కు

ఆహ్లాదకరంగా నందనవనాలు

పద్మారావునగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక సమాజంలో పని ఒత్తిడి, సమయపాలన లేని జంక్‌ఫుడ్ వంటి ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం మూలంగా ఎంతో మంది, చిన్నాపెద్దా అని తేడాలేకుండా అనారోగ్యం పాలవుతున్నారు. కొన్నాళ్ల క్రితం ప్రజలపై విరుచుకుపడ్డ కరోనా మహమ్మారి నేర్పిన పాఠాల కారణంగా ప్రజల ఆహారపు అలవాట్లు మారడంతో పాటు శారీరక వ్యాయామం వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ మధ్య నగరంలోని అన్ని పార్కులు, జీహెచ్ఎంసీ మైదానాల్లో ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజల కోసం ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేసింది. దీంతోపాటు అందమైన సుందర నందనవనాలుగా తీర్చిదిద్దుతున్నారు. దీంతో పరిసరాలు ఆహ్లాదకరంగా మారడంతో సామాన్యులు సైతం వ్యాయామం చేయటానికి ఓపెన్ జిమ్‌లకు క్యూలు కడుతున్నారు. స్థానిక ప్రజలవిన్నపం మేరకు గత ప్రభుత్వ హయాంలో బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని అనేక మైదానాల్లో పచ్చని అందమైన మొక్కలతోపాటు ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేశారు. ఇందుకు మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రత్యేక చొరవ చూపారు. జీహెచ్ఎంసీ పద్మారావునగర్ పార్కు, వెంకటాపురం కాలనీపార్కు, బోయగూడ కేటీఆర్‌పార్కు, స్కందగిరిహిల్స్‌లోని సమోస పార్కు, చిదానందం కాలనీలోని తెలంగాణ దశాబ్ది పార్కులు స్థానిక ప్రజల కోసం సుందరంగా తీర్చిదిద్దబడ్డాయి. దీంతో ఉదయం వాకింగ్, వ్యాయామంతోపాటు సాయంత్ర పిల్లాపాపలలో పార్కుల్లో కుటుంబాలు సేదతీరుతున్నాయి.


ఓపెన్‌జిమ్‌లో వ్యాయామం చేస్తున్న యువతులు

ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

బౌద్ధనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వారాసిగూడ పోలీస్‌స్టేషన్ అడ్మిన్ ఎస్సై సుధాకర్ కోరారు. ఆదివారం పార్శీగుట్ట న్యూఅశోక్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ, మైసమ్మ ఆలయంలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం వల్ల దాడులు, నేరాలతో పాటు చోరీలను అరికట్టవచ్చునని తెలిపారు. దాతలు, కాలనీలవాసులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు పిట్టల ఓంప్రకాశ్‌ముదిరాజ్, కమిటీ సలహాదారు వేణుగోపాల్‌గౌడ్, ప్రధానకార్యదర్శి డప్పు మల్లికార్జున్‌మాదిగ, ఉపాధ్యక్షుడు అశోక్, సభ్యులు రాముముదిరాజ్, శ్రీనివాస్, రాజేష్, బాచి, బీఎన్‌కేగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న అడ్మిన్ ఎస్సై సుధాకర్ తదితరులు

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు కోసం న్యాయపోరాటం

బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్

రాంనగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాలకు ప్రయోజనం చేకూర్చేందుకు తీసుకున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల రద్దు కోసం న్యాయపోరాటం చేస్తూనే మరోవైపు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ తెలిపారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని బీసీరాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో ఈడబ్ల్యూఎస్ అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ఎన్డీయే ప్రభుత్వం 2019లో 103వ రాజ్యాంగసవరణ ద్వారా తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతోందన్నారు.

ఈ రిజర్వేషన్లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉద్యోగ అవకాశాలు లభించడం లేదన్నారు. ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీలు కలిసి రాజ్యాధికారం సాధిస్తేనే అగ్రవర్ణాలు చేసే కుట్రలు, కుతంత్రాలు తగ్గుతాయన్నారు. బీసీలు రాజ్యాధికారంలోకి రావడానికి తాను కృషి చేస్తానన్నారు. బీసీల కోసం రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ఐక్యత లేకపోవడం వల్లనే 4 శాతం ఉన్న అగ్రవర్ణాలు రాజ్యమేలుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ బాగయ్య, బీసీ రాజ్యాధికార సమితి మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తుల కవిత, ఉపాధ్యక్షురాలు హైమావతి, కార్యదర్శి మంజులు, నాయకులు డి.కొమురయ్య, కుమారస్వామి యాదవ్, యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ మడత కిషోర్, ప్రధాన కార్యదర్శి అనిల్, నగర అధ్యక్షురాలు పద్మావతి పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దాసు సురేష్, పక్కన ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ తదితరులు


హెచ్ఐసీసీలో సీఎంఈ ఆన్ రివిజన్ హిప్ రిప్లేస్‌మెంట్ సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్లు

పెరుగుతున్న తుంటి మార్పిడి సర్జరీలు

● సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డా.ఉదయ్ కృష్ణ మైనేని

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హిప్ జాయింట్ సమస్యలతో రివిజన్ హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీలు పెరుగుతున్నాయని సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, ప్రోగ్రామ్ కోర్సు డైరెక్టర్ డా.ఉదయ్ కృష్ణ మైనేని అన్నారు. తెలంగాణ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్, ట్విన్ సిటీస్ ఆర్థోపెడిక్ సొసైటీ ఆధ్వర్యంలో యశోద ఆస్పత్రి సహకారంతో మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం సీఎంఈ ఆన్ రివిజన్ హిప్ రిప్లేస్‌మెంట్ సదస్సు నిర్వహించారు. తుంటి మార్పిడి శస్త్రచికిత్సల్లో పెరుగుతున్న ప్రాబల్యం, కోవిడ్-19 తర్వాత అధిక స్టెరాయిడ్ వాడకం, గాయాల కారణంగా ప్రభావితమైన రోగుల్లో సంభవించే సమస్యలు, వృద్ధ రోగుల్లో ఏర్పడుతున్న సవాళ్లను పరిష్కరించే విధానాలపై చర్చించారు. యశోద ఆస్పత్రిలో నిర్వహించిన లైవ్ సర్జరీలు, కాన్ఫరెన్స్‌లోని హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాపులో ఆధునాతన వైద్య పద్ధతులను ప్రదర్శించారు. యశోద ఆస్పత్రి డైరెక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ ఆర్థోపెడిక్ కేర్‌ను అభివృద్ధి చేయడంపై ఆస్పత్రి ప్రత్యేక దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. ఈ సందస్సులో దేశవ్యాప్తంగా సుమారు 250 మంది వైద్య ప్రతినిధులు పాల్గొన్నారు.

దక్షిణ డిస్కంలో నెలరోజుల్లో రెండు చోట్లకు బదిలీ!

నచ్చిన చోట పోస్టింగుకు చక్రం తిప్పిన ఓ ఉద్యోగి

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ డిస్కం హెచ్‌ఆర్ విభాగంలో కొంతమంది ఉద్యోగులు నచ్చినోళ్లకు ఇష్టానుసారంగా పోస్టింగులిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా నెలరోజుల క్రితం ఇంజనీర్లతోపాటు పలు విభాగాల్లో ఉద్యోగులను విద్యుత్‌శాఖ భారీగా బదిలీలు చేసింది. టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఓ ఉద్యోగి అక్టోబరు 16 వ తేదీన మేడ్చల్ సర్కిల్‌కు బదిలీ చేయడంతో ఆ పోస్టులో చేరాడు. నెలరోజులు పూర్తికాకముందే ఆ ఉద్యోగిని తిరిగి కార్పొరేట్ ఆఫీస్‌కు బదిలీ చేసి మరో ఉద్యోగికి అక్కడ పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం అక్కడకు బదిలీచేసిన ఉద్యోగి పెద్దఎత్తున పైరవీ చేయడంతోపాటు హెచ్‌ఆర్‌వింగ్ లోని కొంతమంది అవినీతి అధికారుల అండతో ఆ పోస్టింగ్‌లో చేరినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డిస్కం ఆదేశాలు పాటిస్తూ సాధారణ బదిలీల్లో వెళ్లిన ఉద్యోగి 'నన్ను ఆ స్థానం నుంచి ఎందుకు బదిలీచేశారు' అని ఉన్నతాధికారులను అడిగినా స్పందన లేదు. దీంతో ప్లకార్డుతో కార్పొరేట్‌ఆఫీస్‌లో మౌనప్రదర్శన నిర్వహించాడు. గతంలో సాధారణ బదిలీల్లో సైతం హెచ్‌ఆర్‌లోని కొంతమంది సీఎండీకి తప్పుడు నివేదికలిచ్చి అనేక అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి.

2 నుంచి మైనార్టీ అభ్యర్థులకు గ్రూప్-2 మాక్ టెస్టులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్ష రాసే మైనార్టీ అభ్యర్థులకు డిసెంబరు 2, 3, 9, 10 తేదీల్లో రెండు ఫ్రీఫుల్‌లెంగ్త్ మాక్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఆయా తేదీల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్షలుంటాయని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి మహ్మద్ ఇలియాస్ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు గన్‌ఫ్రౌండీలోని జామియా నిజామియా కాంప్లెక్స్‌లో గానీ, 040-23236112లో గానీ సంప్రదించాలని కోరారు.

బల్దియాలో ఎలుకల బెడద

ఫైళ్లు, కంప్యూటర్ల వైర్లు ధ్వంసం

హైదరాబాద్ సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో ఎలుకల బెడద ఎక్కువైంది. పలు విభాగాల్లో ఫైళ్లలోని పత్రాలు, కంప్యూటర్ వైర్లను కొరుకుతున్నాయి. వైర్లు పాడవుతుండడంతో కంప్యూటర్లు పని చేయక ఈ- ఆఫీస్‌లో ఫైళ్ల పరిశీలన నిలిచిపోతోంది. మాన్యువల్‌గా వచ్చే ఫైళ్ల పరిశీలనలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. ఫైళ్లను సైతం ఎలుకలు కొరుకుతుండడంతో కొన్ని కాగితాలు మిస్సవుతున్నాయి. ఓ విభాగంలో కీలక ఫైల్‌ను ఎలుకలు తినడంతో మరోసారి పూర్తి వివరాలు పంపాలని కేంద్ర కార్యాలయం నుంచి ఓ సర్కిల్ ఆఫీస్‌కు ఆదేశాలు వెళ్లాయి. ఫైళ్లను బీరువాలు, కప్ బోర్డుల్లో పెట్టినా ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ఓ బహుళ అంతస్తుల భవన నిర్మాణ ప్రతిపాదనలకు సంబంధించిన ప్లాన్‌ను ఎలుకలు కొరికాయి. దీంతో మరోసారి ప్లాన్ సమర్పించాలని అధికారులు సూచించారు. పలు విభాగాల్లోని అదనపు కమిషనర్ కార్యాలయం పేషీల్లో ఎలుకలు పట్టేందుకు చిన్న బోన్లు ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల క్రితం ఆధునీకరణ పనులు చేసిన విభాగాల్లోనూ ఎలుకలు కనిపిస్తుండడం గమనార్హం. అధికారుల యాంటీ రూమ్‌లు, రెస్ట్ రూముల్లోనూ ఎలుకలు వస్తున్నాయని భవన నిర్వహణ అధికారులకు సిబ్బంది ఫిర్యాదు చేస్తున్నారు.


ఎలుకలు కొరికిన కంప్యూటర్ వైర్లు

మహాసుదర్శన హోమం, శ్రీనివాస కల్యాణ మహోత్సవం



అన్నానగర్‌లోని శ్రీపోచమ్మ, పెద్దమ్మ, ఎల్లమ్మ దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆదివారం 54 హోమగుండాలతో మహాసుదర్శన హోమం, శ్రీనివాసకల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. - (సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి)



కంటోన్మెంట్ నియోజకవర్గం బోయిన్‌పల్లి నేతాజీనగర్ వార్డు-1లో మల్కాజిగిరి పార్లమెంట్ అడ్‌హాక్ కమిటీ సభ్యులు జనగాం నర్సింగరావు ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశోక్‌యాదవ్, అనురాధ, రుకేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. - (బోయిన్‌పల్లి, ఆంధ్రజ్యోతి)


ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఓటర్ సవరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఓటర్ సవరణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అడ్డగుట్ట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజల వద్దకు వచ్చే ఓటర్ సవరణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ కేకేసీ సికింద్రాబాద్ జిల్లా డీసీపీ జిల్లా చైర్మన్ గంట రాజుసాగర్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు భూపతి హరితోపాటు కాంగ్రెస్ నేతలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ సవరణ చేసుకునేందుకు వీలుగా అడ్డగుట్టలోని ప్రముఖ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంత వరకు ఓటులేని వారు, 18 ఏళ్ల నండిన యువతీయువకులు కొత్తగా ఓటర్ నమోదు చేయించుకోవాలని సూచించారు.


ట్రోఫీని బహూకరిస్తున్న కిరణ్

వాలీబాల్ విజేత చెన్నై

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): చెరుకూరి విఠల్ స్మారక వాలీబాల్ టోర్నమెంట్‌లో చెన్నై జట్టు విజేతగా నిలిచింది. నగరంలో రెండ్రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు ఆదివారం ముగిశాయి. ఫైనల్లో చెన్నై జట్టు 25-22, 25-23తో ముంబైపై గెలిచి, ట్రోఫీ సొంతం చేసుకుంది. జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు, టీజీఎస్‌ఆర్టీసీ డీవీఎం జి.కిరణ్ రెడ్డి విజేత జట్టుకు ట్రోఫీ ప్రదానం చేశారు.

సమ్మోహనంగా యువన కూచిపూడి నాట్యం



నాట్యం చేస్తున్న నర్తకి యువన

రవీంద్రభారతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నాట్యాంశాలకు వైవిధ్యభరితంగా నర్తించిన యువ నర్తకి యువనర్మశీలన్ ప్రేక్షకులను సమ్మోహనపరిచింది. ఆదివారం భారతీయ విద్యాభవన్‌లో అక్ష స్కూల్ ఆఫ్ పర్ఫామింగ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్య గురువు నిహంత్రిరెడ్డి శిష్యురాలైన యువన కూచిపూడి నాట్యంలో రంగప్రవేశం చేశారు. చక్కటి నాట్యంతో నర్తకి ఆహుతుల్ని అలరించింది. ఈ సందర్భంగా ప్రణామం, కృష్ణమ్ కళాయసఖి, భామకలాపం, పరులన్నమాత తదితర అంశాల్లో నర్తించి భళా అనిపించింది. చక్కటి అభినయం ఆకట్టుకునే హావభావాలతో నర్తకి యువన రంజింపజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాట్య గురువు పద్మజారెడ్డి తదితరులు పాల్గొని నర్తకి యువనను సత్కరించి అభినందించారు. నాట్య గురువు నిహంత్రిరెడ్డికి గురు సత్కారం చేశారు.

పేకాట స్థావరంపై దాడి.. ఆరుగురి అరెస్ట్

మదీన, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్, బహదూర్‌పురా పోలీసులు ఓ పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. బహదూర్‌పురా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కిషన్‌బాగ్‌లో పేకాట ఆడుతున్నారని సమాచారమందడంతో శనివారం రాత్రి దక్షిణ మండలం పోలీసులు, బహదూర్‌పురా సంయుక్తంగా దాడి చేశారు. పేకాట స్థావరం నిర్వహిస్తున్న ముహమ్మద్ రఫీక్‌తో పాటు మరో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి సుమారు రూ.20వేలు నగదు, కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కేసును బహదూర్‌పురా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయిన యువకుడు


మాజిద్

మదీన, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. చాంద్రాయణగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట జీఎం చావుని ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇక్బాల్ కుమారుడు మాజిద్(19) మెకానిక్. ఈనెల 19న తల్లి మందలించిందని మనస్తాపానికి గురై 20వ తేదీన ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు అతని కోసం ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మజిద్ ఆచూకీ తెలిసినవారు 8712571899 నంబర్‌లో సమాచారమివ్వాలని పోలీసులు పేర్కొన్నారు.